సాక్షి
నంద్యాల
సోమవారం : 27 : మే : 2024




అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న శాశ్వ త అన్నదాన పథకానికి కర్ణాటక రాష్ట్రం రాయచూరుకు చెందిన శివ నాగమ్మ కుటుంబ సభ్యులు రూ.1,00,116 విరాళం అందించారు.



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలం: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామికి ఆదివారం పల్లకీ సేవ నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి ఆలయ ప్రదక్షిణ చేశారు.



నల్లమలలో ఆశల వేట!

నల్లమలలోని సర్వనరసింహ స్వామి ఆలయం వద్ద వంకలో వజ్రాన్వేషణ సాగుతోంది. ప్రజలు అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

మహానందిలో రాహుకేతు పూజలు



రాహుకేతు పూజల్లో పాల్గొన్న భక్తులు

మహానంది: మహానందీశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం రాహుకేతు పూజలను భక్తులు నిర్వహించుకున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన పలువురు భక్తులు ఆదివారం కావడంతో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ మేరకు వేద పండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంతశర్మ, ఆంజనేయశర్మల ఆధ్వర్యంలో రాహుకేతు పూజలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ పూజలు చేసుకోవడం ద్వారా సకల సర్పదోషాలతో పాటు గ్రహదోషాలు తొలగి శుభాలు చేకూరుతాయని వేదపండితులు తెలిపారు. మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు గోశాల వద్దకు చేరుకుని గోవులకు గ్రాసం, ప్రసాదం నైవేద్యంగా సమర్పించి భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు.

గురుకులాల్లో మిగులు సీట్లకు కౌన్సెలింగ్

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సమన్వయాధికారిణి డాక్టర్ ఐ.శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 28న బాలురకు చిన్నటేకూరులో, 29న బాలికలకు దిన్నెదేవరపాడు పాఠశాలలో ఉదయం 10 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. బాలుర విభాగంలో ప్రవేశ పరీక్షలో ఎస్సీ 22, ఎస్టీ 25, బీసీ 45, ఓసీ 44 మార్కులకు పైగా మార్కులు సాధించిన వారు మాత్రమే హాజరు కావాలన్నారు. అలాగే బాలికల విభాగంలో ప్రవేశ పరీక్షలో ఎస్సీ 19,ఎస్టీ 19, బీసీ 41, ఓసీ 40 మార్కులకు పైగా సాధించిన వారు మాత్రమే హాజరు కావాలన్నారు.

ఆన్‌లైన్ మూల్యాంకనంపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నేషనల్ పీజీ కళాశాలలో ఆదివారం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల అధ్యాపకులకు ఆన్‌లైన్ మూల్యాంకనంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీవీఈఓ సునీత మాట్లాడుతూ ఇంటర్ సప్లిమెంటరీ జవాబు పత్రాలను ఆన్‌లైన్ ద్వారానే మూల్యాంకనం చేయాల్సి ఉందన్నారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు అధ్యాపకులందరూ జవాబు పత్రాలను ఆన్‌లైన్‌లో దిద్దాలన్నారు. ఈ విధానంపై అవగాహన కల్పించేందుకే శిక్షణలో వర్చువల్ విధానంలో బోర్డు అధికారులు ఆన్‌లైన్ మూల్యాంకనంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జూన్ 1 నుంచి ఆన్‌లైన్ మూల్యాంకనం మొదలవుతుందన్నారు.

ప్రశాంతంగా జేఈఈ అడ్వాన్స్‌డ్



కర్నూలు సిటీ: దేశంలో అత్యున్నత విద్యా సంస్థలైన ఐఐటీల్లో ఇంజినీరింగ్ విద్యను అభ్యసించేందుకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. నగరంలోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న ఐయాన్ డిజిటల్, కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీల్లోని ఐయాన్ డిజిటల్‌లలో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 పరీక్షలకు 920 మంది విద్యార్థులు హాజరయ్యారు. పేపర్–1, పేపర్–2 రెండు పరీక్షలు రాసిన విద్యార్థుల ఫలితాలను మాత్రమే విడుదల చేయనున్నారు. ప్రిలిమినరీ ఆన్సర్ కీని జూన్ 2వ తేదీన విడుదల చేసి, 3వ తేదీన అభ్యంతరాలను స్వీకరించి, 9న తుది కీ విడుదల చేసి, ఫలితాలను విడుదల చేయనున్నారు. 10వ తేదీన జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ (జోసా) తాత్కాలిక సీట్లు కేటాయింపు చేపడుతుంది.

కౌంటింగ్‌కు కౌంట్‌డౌన్

- ఎన్నికల ఫలితాలకు మరో 9 రోజులు
- ప్రతి రౌండ్‌కు 14 టేబుళ్ల చొప్పున ఓట్ల లెక్కింపు
- కౌంటింగ్ సిబ్బందికి శిక్షణ
- ఏజెంట్ల నియామకంపై దృష్టి సారించిన రాజకీయ పార్టీలు
- మొదట శ్రీశైలం.. చివరిగా డోన్ అసెంబ్లీ ఫలితం
- ఓట్ల లెక్కింపునకు ముమ్మర ఏర్పాట్లు

ఎన్నికల ఫలితాలపై జిల్లా ప్రజల్లో ఉత్కంఠ నెలకొంది. కౌంటింగ్ తేదీ సమీపిస్తుండటంతో ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది. ఓట్ల లెక్కింపు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్ల నియామకంపై కసరత్తు చేస్తున్నారు. ఓటరు తీర్పుపై ఓ వైపు విశ్లేషణలు జోరందుకోగా.. మరో వైపు ఆయా పార్టీ నాయకులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజా తీర్పు తెలుసుకునేందుకు జూన్ 4వ తేదీ వరకు వేచి ఉండాల్సి వస్తోంది.



స్ట్రాంగ్‌రూము వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నియోజకవర్గం	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	పోలింగ్ కేంద్రాలు	ఓట్ల లెక్కింపు రౌండ్లు
ఆళ్లగడ్డ	2,32,676	1,95,582	259	19
శ్రీశైలం	1,96,116	1,62,760	226	17
నందికొట్కూరు	2,18,047	1,84,892	251	18
నంద్యాల	2,73,938	2,05,190	286	21
బనగానపల్లె	2,41,179	2,03,839	277	20
డోన్	2,27,351	1,88,169	291	21
మొత్తం	13,89,307	11,40,432	1,983	116

నంద్యాల: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా ముగించిన అధికారులు ఓట్ల కౌంటింగ్‌ను కూడా పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు ఫలితాల కోసం ఇప్పుడు అందరూ ఉత్కంఠంగా ఎదురు చూస్తున్నారు. పోలింగ్‌ను విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగం అదే స్ఫూర్తితో కౌంటింగ్ సజావుగా సాగేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. నంద్యాల పట్టణ శివారులోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల ఓట్ల లెక్కింపునకు వేదిక కానుంది. జిల్లాలో పార్లమెంట్, ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 13,89,307 మంది ఓటర్లలో 11,40,432 మంది తమ ఓటు హక్కును వినియోగించుకొని 82.09 శాతం పోలింగ్ నమోదు చేశారు. 1,983 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈవీఎంలలో భద్రంగా ఉన్న ప్రజా తీర్పును 116 రౌండ్లలో పూర్తి చేయడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కౌంటింగ్ విధుల విషయంలో ఇప్పటి వరకు ఏ అధికారి, సిబ్బందికి గాని వారు ఏ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్‌లో పాల్గొంటారనే విషయం తెలియదు. లెక్కింపు కేంద్రాల లోపలికి కౌంటింగ్ సిబ్బంది, ఆర్‌ఓ, ఏఆర్‌ఓలు, ఎన్నికల అబ్జర్వర్లతో పాటు కౌంటింగ్ ఏజెంట్లు మాత్రమే అనుమతి ఇస్తారు. ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే కౌంటింగ్ ప్రక్రియలో భాగస్వాములను చేస్తారు. చివరి నిమిషం వరకు ఎవరు ఏ టేబుల్ వద్ద విధులు నిర్వహిస్తారో తెలియకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీని వలన ఏ నియోజకవర్గం కౌంటింగ్ హాల్‌లో ఏ ఉద్యోగి విధులు నిర్వహిస్తారో తెలియదు కాబట్టి ఎలాంటి ఆరోపణలు రాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు కౌంటింగ్ సిబ్బందిని ఈనెల 24వ తేదీన ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. దాదాపు 813 మంది సిబ్బందిని సీపీఎంఎస్ సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో ఈ ప్రక్రియ చేపట్టారు. రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ సిబ్బందిని ఆయా నియోజకవర్గాల కౌంటింగ్ టేబుళ్లకు కేటాయించనున్నారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఇలా..

తొలుత పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కిస్తారు. లోక్‌సభకు పోలైన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ప్రత్యేకంగా, అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలైన ఓట్లను ఆయా కౌంటింగ్ కేంద్రాల్లో లెక్కిస్తారు. లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులకు పోలైన పోస్టల్ బ్యాలెట్లను వివిధ దశల్లో పరిశీలిస్తారు. లోక్‌సభ పోస్టల్ బ్యాలెట్లలో అర్హత కలిగిన వాటిని కట్టలు కట్టి లెక్కిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు అనంతరం ఈవీఎంలలోని ఓటర్లను లెక్కిస్తారు. ఉదయం 8గంటల నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కౌంటింగ్ ప్రారంభిస్తారు. ఈవీఎంల ఓట్ల లెక్కింపు 8.30 గంటలకు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఒక్కో నియోజకవర్గానికి 14 టేబుళ్ల చొప్పున ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో టేబుల్‌కు ఒక సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్, ఒక అసిస్టెంట్, ఒక అటెండర్ కలిపి నలుగురు ఉంటారు. రాజకీయ పార్టీలకు చెందిన ఏజెంట్లు ఉంటారు. వారి కోసం ప్రత్యేకంగా బారికేడ్లు ఏర్పాటు చేశారు.

తొలి ఫలితం శ్రీశైలందే...

ఓట్ల లెక్కింపు ప్రక్రియలో భాగంగా తక్కువ రౌండ్లు, తక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న శ్రీశైలం నియోజకవర్గం ఫలితం తొలుత వెలువడనుంది. శ్రీశైలం నియోజకవర్గంలో 226 పోలింగ్ కేంద్రాలు ఉండగా 17 రౌండ్లలో ఫలితం వెల్లడి కానుంది. నందికొట్కూరులో 251 పోలింగ్ కేంద్రాలు ఉండగా 18 రౌండ్లలో ఆళ్లగడ్డలో 259 పోలింగ్ కేంద్రాలు ఉండగా 19 రౌండ్లలో బనగానపల్లె నియోజకవర్గంలో 277 పోలింగ్ కేంద్రాలు ఉండగా 20 రౌండ్లలో ఫలితాలు లెక్కించనున్నారు. నంద్యాల నియోజకవర్గానికి సంబంధించి 286 పోలింగ్ కేంద్రాల్లో 21రౌండ్లు, డోన్ నియోజకవర్గంలో 291 పోలింగ్ కేంద్రాలు ఉండటంతో 21రౌండ్లలో ఓట్ల లెక్కింపు జరగనుంది. మొదటగా శ్రీశైలం అసెంబ్లీ ఫలితం వెల్లడి కానుండగా చివరగా నంద్యాల, డోన్ అసెంబ్లీ ఫలితాలు వెల్లడి కానున్నాయి.

ఏజెంట్ల నియామకంపై దృష్టి..

ఓట్ల లెక్కింపునకు కౌంట్‌డౌన్ మొదలు కావడంతో రాజకీయ పార్టీల నాయకులు ఏజెంట్ల నియామకంపై దృష్టి సారించారు. పదిరోజుల ముందే జిల్లా వ్యాప్తంగా ఈ హడావుడి కనిపిస్తుండటం విశేషం. గెలుపుపై ఎవరికి వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల బెట్టింగ్‌లు సైతం జరుగుతున్నాయి.

స్ట్రాంగ్‌రూముల పరిశీలన



కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీసీ ఫుటేజీను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

ఆర్జీఎం, శాంతిరాం ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలో ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూములను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి భద్రతాపరమైన చర్యలను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ అంతరాయం లేకుండా ఏర్పాటు చేసిన జనరేటర్లు, యూపీఎస్‌లను వినియోగిస్తూ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు కనెక్ట్ చేయబడిన సీసీ ఫుటేజ్‌లను 24/7 నిరంతర నిఘాతో పర్యవేక్షిస్తూ ఉండాలని భద్రతా సిబ్బందిని, సంబంధిత టెక్నీషియన్‌లకు సూచించారు. నిరంతర ప్రసారాల్లో ఎలాంటి లోపాలు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావడంతో పాటు తక్షణమే సరి చేసేలా సిద్ధంగా ఉండాలన్నారు. తనిఖీ అనంతరం సందర్శకుల రిజిస్టర్‌లో సంతకాలు చేశారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్ రూంలు ఉన్న ప్రాంతంలోకి ఎట్టిపరిస్థితుల్లోనూ ప్రవేశించకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెల 4వ తేదీన జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి జరుగుతున్న ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలన్నారు. జూన్ 1 నుంచి 10వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అపోహలు, సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాలు నమ్మకుండా రాజకీయ పార్టీలు, ప్రజలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలన్నారు.

4వ తేదీ 5 గంటల నుంచే..

- ➡ ఓట్ల లెక్కింపు నిర్వహించే జూన్ 4వ తేదీ ఉదయం 5 గంటల నుంచే అధికారులు కౌంటింగ్ ప్రక్రియను సిద్ధం చేయనున్నారు.
- ➡ కౌంటింగ్ సిబ్బంది, రాజకీయ పార్టీల ఏజెంట్లు, ఎన్నికల కమీషన్ పాసు ఉన్న మీడియాను తప్ప ఇతరులు ఎవరినీ లెక్కింపు జరిగే ప్రాంతాలకు అనుమతించరు.
- ➡ కౌంటింగ్ కేంద్రాల్లోకి ఆర్వోలు తప్ప ఇతరులు మొబైల్ ఫోన్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.
- ➡ మీడియా వారికి మీడియా సెంటర్ వరకు మాత్రమే మొబైల్ ఫోన్ అనుమతి ఉంటుంది.
- ➡ ఆర్వోలు, మొబైల్ ఫోన్ ద్వారా రౌండ్ల వారీగా సమాచారం ఇవ్వాలి. ఆర్వోలు డిజిగ్నేటెడ్ అధికారిని నియమించుకొని వారి ద్వారా మీడియా విభాగానికి సమాచారం అందజేస్తారు.
- ➡ ఫాం–17 సీలో నమోదు చేసిన ఓట్లను ఈవీఎంలలో నిక్షిప్తమైన ఓట్ల సంఖ్యతో సరి చూస్తారు. ఆ సంఖ్యను కౌంటింగ్ సిబ్బంది ఫాం–17సీ పార్ట్–2లో నోట్ చేసుకొని ఏజెంట్ల సంతకం తీసుకుంటారు.
- ➡ అనంతరం ఈవీఎంల సీల్ తొలగించి రిజల్ట్ బటన్ నొక్కుతారు. ఆ ఈవీఎంలలో పోలైన ఓట్లలో ఎవరికి ఎన్ని ఓట్లు వచ్చాయనే విషయం తెలుస్తోంది.
- ➡ ఆ వివరాలను కౌంటింగ్ సిబ్బంది నోట్ చేసి ఆ సంఖ్యను ఏజెంట్లకు చూపించి వారు సంతృప్తి వ్యక్తం చేశాక రౌండ్ ఫలితాలను వెల్లడిస్తారు.
- ➡ ఒక్కో రౌండ్‌లో ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయి. అనే వివరాలను కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన బోర్డుపై సిబ్బంది రాస్తారు. ఈ మొత్తం ప్రక్రియ వీడియో తీసి భద్రపరుస్తారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు వేళాయె!

- నేటి నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం
- 31 నుంచి ఆప్షన్ల ఎంపిక
- వచ్చేనెల 3న సర్టిఫికెట్ల పరిశీలన
- 7న సీట్ల కేటాయింపు



నంద్యాల(న్యూటౌన్): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది. గత నెల 27న నిర్వహించిన పాలిసెట్‌లో జిల్లా వ్యాప్తంగా 4,857 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వారు పాలిటెక్నిక్ కోర్సులలో అడ్మిషన్లకు ర్యాంకుల వారీగా ఇచ్చిన తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ నెల 27 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు నిర్వహించే కౌన్సెలింగ్‌లో విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తారు. ఈ విద్యార్థులు నంద్యాల జిల్లాలోని శ్రీశైలం, బేతంచెర్ల, నంద్యాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఎక్కడైనా కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం దగ్గరలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి ఉచితంగా ఆప్షన్లు ఎంచుకోవచ్చు. వారికి ఇచ్చిన తేదీ ప్రకారం ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందాలి. ఈనెల 31వ తేదీ నుంచి ఆప్షన్ల ఎంపికకు అవకాశం కల్పించారు. వచ్చేనెల 3న సర్టిఫికెట్ల పరిశీలన, 5వ తేదీన ఆప్షన్ల మార్పునకు అవకాశం ఇచ్చారు. 7వ తేదీన సీట్ల కేటాయింపు చేయనున్నారు.

- ➡ ప్రత్యేక కేటగిరీలకు చెందిన ఎన్‌సీసీ, ఆంగ్లో ఇండియన్, స్పోర్ట్స్ పీడబ్ల్యూడీ, క్యాప్, స్కౌట్ వంటి వారికి ఈ నెల 31 నుంచి జూన్ 3 వరకు విజయవాడ బెంజ్ సర్కిల్ సమీపంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తారు.
- ➡ కౌన్సెలింగ్‌కు హాజరయ్యే ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ఆన్‌లైన్‌లో ప్రాసెస్ ఫీజు చెల్లించాలి.
- ➡ ఫీజు చెల్లించిన రశీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కుల జాబితా, 4 నుంచి 10వ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్ అందజేయాలి.
- ➡ స్టడీ సర్టిఫికెట్ లేని వారు ఏడేళ్ల రెసిడెన్షియల్ సర్టిఫికెట్, ఈడబ్ల్యూఎస్ వర్తించే వారు అర్హత ధ్రువ పత్రం అందజేయాలి.
- ➡ కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, నాన్ లోకల్ విద్యార్థులు మైగ్రేషన్ సర్టిఫికెట్, పీడబ్ల్యూడీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, స్కౌట్, మైనారిటీ, ఆంగ్లో ఇండియన్ వంటి ప్రత్యేక రిజర్వేషన్లు ఉన్న వారు అర్హత ధ్రువీకరణ పత్రాలను కౌన్సెలింగ్ సమయంలో అందించాలి.

సర్టిఫికెట్ల పరిశీలన షెడ్యూల్

తేదీ	ర్యాంకులు
27	1 - 12000
28	12001 - 27000
29	27001 - 43000
30	43001 - 59000
31	59001 - 75000
జూన్ 01	75001 - 92,000
2	92001 - 1,08,000
3	1,08,001 నుంచి చివరి ర్యాంకు వరకు

సీట్ల అందుబాటు ఇలా..

జిల్లాలో మూడు ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలున్నాయి. ఆయా కళాశాలల్లో కంప్యూటర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంప్యూటర్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్ తదితర కోర్సులు అందుబాటులో ఉన్నాయి. పలు కళాశాలల్లో ఒక్కో కోర్సులో ఒక్కో బ్రాంచ్‌కు 60 నుంచి 120 వరకూ సీట్లు ఉన్నాయి. ఎకనామికల్లీ వీకర్ సెక్షన్స్ (ఈడబ్ల్యూఎస్) కింద ప్రతి బ్రాంచ్‌లో అదనంగా 10 శాతం సీట్లు పెంచి ప్రవేశాలు కల్పిస్తారు. పాలిటెక్నిక్ కోర్సు కాల వ్యవధి మూడు సంవత్సరాలు. దీనిలో భాగంగా ఆరు నెలల పాటు పారిశ్రామిక శిక్షణ ఉంటుంది. విద్యార్థులు నైపుణ్యం పెంపొందించుకునేందుకు సైతం శిక్షణ ఇస్తారు.

సీట్ల వివరాలు..

నంద్యాల ప్రభుత్వ కళాశాలలో: డీసీఈ సివిల్ ఇంజనీరింగ్ 66, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ 132, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 132, డీఎంఈ మెకానికల్ ఇంజనీరింగ్ 132

శ్రీశైలం ప్రభుత్వ కళాశాలలో.. డీసీఈ 66, డీఈసీఈ 66, డీఈఈఈ 66, డీఎంఈ 66

బేతంచెర్ల ప్రభుత్వ కళాశాలలో.. డీఏఐఈ 66, డీఈసీఈ 66, డీఈఈ 66, డీఎంఈ 66

షెడ్యూల్ ప్రకారం



పాలిసెట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి, షెడ్యూల్ ప్రకారం ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరు కావాలి. ర్యాంకు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం సీట్ల కేటాయింపు ఉంటుంది.

– శ్రీనివాసప్రసాద్,
ప్రిన్సిపాల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, నంద్యాల



భక్తులతో నిండిన క్యూ కంపార్టుమెంట్

శ్రీశైలంలో భక్తుల రద్దీ

శ్రీశైలం: వేసవి సెలవులతో పాటు వారాంతపు రోజు ఆదివారం కావడంతో శ్రీశైల క్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ప్రధాన వీధులు కిక్కిరిసిపోయాయి. వేకువజాము నుంచి భక్తులు ఉచిత, ప్రత్యేక, అతి శీఘ్రదర్శన క్యూల ద్వారా స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. దేవస్థానం ఈఓ పెద్దిరాజు క్యూలలో ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారం అందేలా ఏర్పాట్లు చేశారు. ఉచిత దర్శనానికి నాలుగు గంటలకు పైగా సమయం పట్టింది. ఆన్‌లైన్ ద్వారా స్పర్శదర్శనానికి టికెట్లు తీసుకున్న భక్తులను విడతల వారీగా వారికి కేటాయించిన సమయాలలో దర్శనానికి అవకాశం కల్పించారు.



కుందూనది పరివాహక ప్రాంతంలో సాగుచేసిన వేరుశనగ

కుందూ పారింది.. పంట పండింది

రబీలో సాగు చేసిన వేరుశనగ పంట చేతికందుతుందా లేదా అని ఆందోళన చెందిన రైతులు చివరకు గట్టెక్కారు. కుందూనది తీరంలోని క్రిష్టిపాడు గ్రామ రైతులు ఏటా రబీలో వరి, మిరప సాగు చేసేవారు. ఈ ఏడాది ప్రత్యామ్నాయంగా వేరుశనగ పంటను వేశారు. కొద్ది రోజుల తర్వాత నదిలో నీరు పూర్తిగా ఎండిపోయింది. దిగాలు పడిన రైతులు కందూలో పెద్ద గుంతను తవ్వుకొని ఊట ద్వారా వచ్చే నీటితో పంటను కాపాడుకున్నారు. అనంతరం కుందూ తీర ప్రాంత ప్రజల తాగునీటి అవసరాల కోసం అధికారులు నీటిని వదలడంతో వేరుశనగ రైతుల పంట పండింది. దీంతో ఎకరానికి 15 నుంచి 20 క్వింటాళ్ల దాకా దిగుబడులు వచ్చే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం క్వింటం రూ.15 వేల నుంచి 16 వేల వరకు ధర ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఖరీఫ్‌లో నష్టపోయిన తాము రబీలో గట్టెక్కామని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వేరుశనగ కాయలను కోస్తున్న కూలీలు

– దొర్నిపాడు

ఓట్ల లెక్కింపులో పొరపాట్లకు తావివ్వొద్దు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపులో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీనివాసులు కౌంటింగ్ సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సంపూర్ణ శిక్షణ పొంది అవగాహన పెంచుకోవాలన్నారు. కౌంటింగ్ విధులు నిర్వహించేందుకు మొదటి ర్యాండమైజేషన్‌లో కౌంటింగ్ సూపర్ వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్, మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. సమర్థవంతమైన కౌంటింగ్ విధుల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలున్నా క్షుణ్ణంగా అడిగి తెలుసుకోవాలన్నారు. కౌంటింగ్ హాల్‌లో ఈవీఎం, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ప్రక్రియ ఏ విధంగా నిర్వహించాలన్న అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కౌంటింగ్ సమయంలో రౌండ్ల వారీ వివరాలను ఏజెంట్లకు వినపడేలా కౌంటింగ్ సిబ్బంది చదవాలని, మైక్రో అబ్జర్వర్లు కూడా సదరు వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. ప్రతి రౌండ్ పూర్తి అయిన వెంటనే ఏజెంట్ల సంతకాలు తీసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి పార్లమెంటుకు గ్రీన్ కవర్స్, అసెంబ్లీకి పింక్ కవర్స్ టేబుల్స్ మీద ఉంచడం జరుగుతుందన్నారు. జూన్ 4వ తేదీ ఉదయం 5.30 గంటలకు జరిగే రెండవ ర్యాండమైజేషన్ ద్వారా కౌంటింగ్ కేంద్రాలలో ఏ టేబుల్‌కి ఏ సిబ్బంది కేటాయించబడారనే విషయం తెలుస్తుందని కలెక్టర్ వివరించారు. నంద్యాల అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈవీఎం, వీవీ ప్యాట్ యంత్రాల్లో అడ్రస్ ట్యాగ్, పింక్ పేపర్ సీల్, గ్రీన్ పేపర్ సీల్, కౌంటింగ్ ఏ విధంగా చేయాలనే అంశాలపై కౌంటింగ్ సిబ్బందికి వివరించారు. ఓట్ల లెక్కింపు విధుల్లో సంపూర్ణ శిక్షణ పొంది ప్రతి అంశంపై స్పష్టత కలిగి ఉండాలన్నారు. కౌంటింగ్ విధులు నిర్వహించే సిబ్బంది కచ్చితంగా కౌంటింగ్ రోజున ఉదయం 6 గంటలకే ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ హాళ్లకు చేరుకోవాలన్నారు.



శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీనివాసులు

క్లుప్తంగా

రాళ్లదొడ్డి సమీపంలో కారు బోల్తా



ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామ సమీపంలో ఆదివారం సాయంత్రం కారు బోల్తా పడింది. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కర్నూలుకు చెందిన కుటుంబ సభ్యులు నలుగురు మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకొని తిరిగి వెళ్తున్నారు. రాళ్లదొడ్డి సమీపంలో వేగంగా వెళ్తున్న కారు మలుపు దగ్గర అదుపుతప్పి బోల్తాపడింది. అయితే ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. ప్రమాదం నుంచి బైటపడ్డవారు కారును వదలి బస్సులో కర్నూలు వెళ్లిపోయారు. ప్రమాద వివరాలు సేకరిస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

వ్యక్తి దారుణహత్య



బాణాల హరి ప్రసాద్ (ఫైల్)

బేతంచెర్ల: రుద్రవరం గ్రామంలో వ్యక్తిగత మనస్పర్ధలతో ఓ వ్యక్తిని హత్య చేసిన సంఘటన చోటు చేసుకుంది. సీఐ ప్రియతం రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వడ్ల వెంకటేశ్వర్లు కుమారుడు బాణాల హరి ప్రసాద్‌తో అదే గ్రామానికి చెందిన కొత్త గొల్ల వెంకటేశ్వర్లు, కొత్త గొల్ల వెంకట సుబ్బయ్య, బోయ బీసన్న గారి చిన్న మద్దయ్యకు వ్యక్తిగత మనస్పర్ధలు ఉన్నాయి. దీంతో ముగ్గురు వ్యక్తులు శనివారం సాయంత్రం గ్రామంలోని హరి ప్రసాద్ ఇంటి దగ్గరకు వెళ్లి గొడవ పెట్టుకున్నారు. ఈ గొడవలో కట్టెలు, రాళ్లు, పిడి బాకులతో హరి ప్రసాద్‌పై(38) దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. చికిత్స నిమిత్తం బాధితుని కర్నూలుకు తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. మృతుని తండ్రి వడ్ల వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై హత్య కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రియతం రెడ్డి ఆదివారం తెలిపారు. మృతునికి భార్యతో పాటు కొడుకు, కుమార్తె ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి



మృతురాలు వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఓర్వకల్లు: గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని కాల్వబుగ్గ వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కాల్వబుగ్గకు చెందిన బోయ సంజీవమ్మ(70) అనే వృద్ధురాలు కాల్వబుగ్గ దేవస్థానం నుంచి ఇంటికి బయలుదేరింది. జాతీయ రహదారిని దాటుతుండగా నంద్యాల వైపు నుంచి కర్నూలుకు అతివేగంతో వెళ్లుతున్న గుర్తుతెలియని కారు సంజీవమ్మను ఢీకొట్టింది. దీంతో రోడ్డుపై కిందపడిన ఆమె తలకు తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. చికిత్స నిమిత్తం కర్నూలుకు తీసుకెళ్లే సమయంలో మృతి చెందినట్లు గమనించారు. మృతురాలికి సుబ్బరాయుడు, రాజు అనే ఇద్దరు కొడుకులు సంతానం ఉన్నట్లు తెలిసింది.



తవ్వి చూద్దాం.. లోపల వజ్రం ఉంటుందేమో!



ఓ రత్నం దొరుకుతుందన్న ఆశతో..



చూద్దాం.. ఈ రాయి పనికొస్తుందేమో!

నల్లమలలో ఆశల వేట!

- వజ్రాల కోసం అన్వేషణ
- అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న ప్రజలు



నల్లమలలోని సర్వనరసింహ స్వామి ఆలయం



అన్వేషణలో.. అదృష్టం వరిస్తుందేమో!



వజ్రాలవంక ఉన్న నల్లమల అడవి

మహానంది: నల్లమల.. ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలకు, ప్రకృతి అందాలకు, చారిత్రక విశేషాలకు పెట్టింది పేరు. నంద్యాల నుంచి గిద్దలూరు వెళ్లే ఘాట్‌రోడ్డులో సర్వనరసింహ స్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందింది. ఆలయానికి సమీపంలో ఉల్లెడ మల్లేశ్వరస్వామి ఆలయంతో పాటు వజ్రాల వంక ఉంది. వర్షాలు పడితే వంకలో వజ్రాలు దొరుకుతుంటాయని ప్రజల నమ్మకం. దీంతో కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలతో పాటు గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి వందలాది మంది ప్రజలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఇక్కడికి వస్తున్నారు. తాజాగా వర్షాలు పడుతుండటంతో వజ్రాన్వేషణ సాగుతోంది.

విలువైన రాళ్లతో ఆదాయం

వజ్రాలు దొరుకుతున్నాయని వస్తున్న వారికి పలు రకాల రంగురాళ్లు దొరుకుతున్నాయి. రంగు రాయి నాణ్యతను బట్టి రూ. 20 వేల నుంచి రూ. లక్ష వరకు వస్తుందని పలువురు చెబుతున్నారు. వారం రోజుల క్రితం గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరికి రూ. లక్ష విలువైన వజ్రాలు దొరికాయని స్థానికులు చెప్పారు. దీంతో ఇక్కడికి వచ్చిన వారు ఉదయం నుంచి చీకటి పడేవరకు వజ్రాన్వేషణ చేసి అనంతరం దగ్గరలోని ఆంజనేయపురం గ్రామం వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద రాత్రి వేళల్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో వజ్రాన్వేషణ కోసం వస్తున్నవారి సంఖ్య గణనీయంగా పెరిగింది.

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేణుగోపాల్

కర్నూలు (టౌన్): జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వేణుగోపాల్ ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సాధారణ సమావేశం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా లోకేష్ , ఉపాధ్యక్షులుగా మురళీమోహన్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి , గోపాల్ రెడ్డి , సంయుక్త కార్యదర్శులుగా శ్యామ్‌కుమార్, రేష్మ , కోశాధికారి రవితేజ, ఈసీ మెంబర్లు శ్రీనివాసరావు, సుప్రియ, కళ్యాణి, నాగేశ్వరి, సుమిత్ర ఎన్నికయ్యారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి రామాంజనేయులు, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ విజయ భాస్కర్ పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

వెలుగోడు: జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగోడు పట్టణంలో చోటు చేసుకుంది. శనివారం రాత్రి సీపీ నగర్‌కు చెందిన షేక్ ఖాశీం (45) ఇంట్లో ఫ్యాన్‌కు గురి వేసుకొని బలవన్మరణం పొందాడు. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఖాశీంకు పదేళ్ల క్రితం పులిమద్ది గ్రామానికి చెందిన షేక్ రజియాబీతో వివాహమైంది. ఆరు నెలల క్రితం భార్య ఊరు పులిమద్దికి వెళ్లిన ఖాశీం కూలీ పనులు చేసుకుంటూ మద్యానికి బానిసయ్యాడు. చెడు వ్యసనాలు మానుకోవాలని భార్య, బంధువులు పలుమార్లు చెప్పినా వినిపించుకోలేదు. రెండు రోజుల క్రితం వెలుగోడులో నిర్వహిస్తున్న రోఖియాబీ ఉరుసుకు వెళ్దామని భార్య పిల్లలను పిలువగా, వారు రాకపోవడంతో ఖాశీం ఒక్కడే వచ్చాడు. తన తల్లి ఇంట్లో శనివారం రాత్రి మద్యం సేవించి, జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఖాశీం భార్య రజియాబీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హత్య చేసిన భర్త

- పోలీసుల అదుపులో నిందితుడు



సుగుణమ్మ (ఫైల్)

కొలిమిగుండ్ల: ఐదు పదుల వయసు దాటిన భార్యకు తోడు నీడగా ఉండాల్సిన భర్తనే దారుణంగా హత్య చేశాడు. ఈ విషాదకర సంఘటన ఆదివారం తెల్లవారు జామున కనకాద్రిపల్లెలో చోటు చేసుకుంది. గ్రామంలోని మొరుసు వీధిలో కొమ్మెరు రమణయ్య, సుగుణమ్మ(54) దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులుగా కాగా పెళ్లిళ్లు అయ్యాయి. రమణయ్య భవన నిర్మాణ కార్మికుడిగా పని చేస్తుంటాడు. మద్యం సేవిస్తూ తరచూ భార్యతో పాటు కుమారులతో గొడవ పడుతుండేవాడు. ఎంత చెప్పినా మారకపోవడంతో ఇటీవల కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు పంపించారు. అదే వీధిలోనే ఓ ఇళ్లు అద్దెకు తీసుకొని ఒక్కడే ఉంటున్నాడు. వేరుగా ఉంటున్నా భార్యతో గొడవ పడేవాడు. శనివారం రాత్రి కూడా మద్యం మత్తులో భార్యతో వాగ్వాదానికి దిగాడు. తనను ఇంటి నుంచి గెంటించినందుకు ఆమెను చంపేస్తానని కూడా బెదిరించాడు. రాత్రి సుగుణమ్మ ఇంటి ముందు నాలుగేళ్ల మనవడు తేజతో కలిసి నిద్ర పోయింది. అర్ధరాత్రి తర్వాత మంచంపై నిద్రలో ఉండగానే రమణయ్య పదునైన ఆయుధంతో తలపై విచక్షణా రహితంగా దాడి చేయడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. నాపరాళ్ల లోడు దింపేందుకు కల్యాణదుర్గం వెళ్లి ఆదివారం తెల్లవారుజామున ఇంటికి తిరిగి వచ్చిన చిన్న కుమారుడు సురేష్ రక్తమడుగులో ఉన్న తల్లిని చూసి కేకలు వేశాడు. విషయం తెలుసుకున్న సీఐ గోపీనాథ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలపై ఆరా తీశారు. హత్యకు పాల్పడిన రమణయ్యను గ్రామ శివార్లలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సీమలో వర్ధిల్లుతున్న సాంఘిక నాటకం



కళాకారులతో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గుమ్మళ్ల బలరామయ్య

కర్నూలు(సెంట్రల్): రాయలసీమలో సాంఘిక నాటక రంగం వర్ధిల్లుతోందని, ఇక్కడి ప్రజల ఆదరాభిమానాలు నాటకాలకు ఎంతో విలువను ఇస్తున్నాయని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి గుమ్మళ్ల బలరామయ్య అన్నారు. ఆదివారం రాత్రి టీజీవీ కళాక్షేత్రంలో హైదరాబాద్‌కు చెందిన మల్లాది క్రియేషన్స్ ఆధ్వర్యంలో చీకట్లో చంద్రుడు అనే హాస్య నాటిక ప్రదర్శన జరిగింది. ఈ నాటికలో మల్లాది భాస్కర్, తేజమూర్తులు, మురళీధర్, ఆకెళ్ల గోపాల కృష్ణ, శ్రీనివాస్ నాయుడు, అర్జున్, జీఎస్ చలపతి బృందం అద్భుతంగా నటించారు. అంతకముందు కార్యక్రమంలో ప్రముఖ న్యూరో సర్జన్ డబ్ల్యూ సీతారాం, బలరామయ్య, కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కలసి జ్యోతిప్రజ్వలన చేశారు. నాటక ప్రదర్శన అనంతరం నటులకు బలరామయ్య రూ.20 వేల పారితోషికాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి నెలా చివరి ఆదివారం కళాక్షేత్రంలో నాటక ప్రదర్శన జరగడం గొప్ప విశేషమన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో జరగని విధంగా ఇక్కడ కళా పరిషత్ లేకున్నా నాటకాల ప్రదర్శన జరుగుతుండడం అభినందించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా కరీమముల్లా శిష్యం బృందం అద్భుతమైన ప్రదర్శనను ఇచ్చింది. కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు బి.ఈశ్వరయ్య, ఇనయతుల్లా, సీవీ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

పప్పుదినుసుల సాగు పద్ధతులపై అవగాహన



మాట్లాడుతున్న విశ్రాంత జేడీఏ జయచంద్ర

కర్నూలు(అగ్రికల్చర్): పప్పు దినుసుల సాగు పద్ధతులపై ఇన్‌పుట్ డీలర్లకు విశ్రాంత జేడీఏ, దేశీ డిప్లొమ కోర్సు సమన్వయకర్త జయచంద్ర అవగాహన కల్పించారు. కర్నూలు ఏడీఏ కార్యాలయంలో ఆదివారం దేశీ డిప్లొమా కోర్సు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పప్పు దినుసులైన కందులు, మినుములు, పెసలు, అలసందలు, శనగలకు మార్కెట్‌లో డిమాండ్ ఉందని, గిట్టుబాటు ధరలు కూడా లభిస్తున్నాయని పేర్కొన్నారు. పప్పు దినుసుల పంటల సాగు పద్ధతులు, చీడపీడలవాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సిఫార్సు చేసిన మేరకే ఎరువులు వినియోగించాలని, మోతాదుకు మించితే పలు అనర్థాలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. పప్పు దినుసుల పంటలకు నత్రజని ఎరువులు ఎక్కువగా అవసరం ఉండదని, కావున యూరియా అధికంగా వినియోగించరాదని సూచించారు. రైతులు ప్రతి అవసరానికి ఇన్‌పుట్ డీలర్ల దగ్గరకు వస్తుంటారని, వారికి చక్కటి సలహాలు ఇచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 40 మంది ఇన్‌పుట్ డీలర్లు పాల్గొన్నారు.

వన్యప్రాణి వేటగాళ్లపై నిఘా పెట్టండి

కొత్తపల్లి: వన్యప్రాణి, క్రూరమృగాల వేటగాళ్లపై అటవీ శాఖ సిబ్బంది నిఘా పెట్టాలని ఆత్మకూరు స్క్వాడ్ డీఎఫ్ఓ రామ కొండారెడ్డి సూచించారు. ఆదివారం మండల పరిధిలోని గువ్వలకుంట్ల, కొత్తపల్లి అటవీ శాఖ పరిధిలోని బేస్ క్యాంపులను స్క్వాడ్ రేంజ్ అధికారి శ్రీకాంత్ రెడ్డితో కలిసి ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా బేస్ క్యాంపుల వద్ద సిబ్బంది విధులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వన్యప్రాణులు, క్రూరమృగాలు సంచరిస్తున్నాయని ఇదే అదునుగా వేటగాళ్లు ఉచ్చులు వేసి వాటిని వధిస్తున్నట్లు సమాచారం వచ్చిందని, అటవీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వన్యప్రాణుల సంరక్షించే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గోశాల ప్రహరీ ఎత్తును పెంచండి



మల్లమ్మ ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలిస్తున్న ఈఓ

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని మల్లమ్మ ఆలయ సమీపంలోని గోశాల ప్రహరీ ఎత్తును పెంచాలని ఇంజినీరింగ్ అధికారులకు ఈఓ పెద్దిరాజు సూచించారు. ఆదివారం ఆయన హేమారెడ్డి మల్లమ్మ దేవాలయం, గోశాలను ఆయన పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న ఫ్లోరింగ్ మరమ్మతులు చేసి అక్కడ ఉన్న కటాంజనాలకు కూడా పెయింటింగ్ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. గోశాల ప్రాంగణంలో చింత, వేప, రావి తదితర నీడనిచ్చే వృక్షాలను పెంచాలని సూచించారు. ఆయన వెంట ఈఈ రామకృష్ణ, మురళీధర్ రెడ్డి, పీఆర్ఓ శ్రీనివాసరావు ఈ జైపాల్ నాయక్, విశ్రాంత మాజీ ఉద్యాన వన సంచాలకులు ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై దాడులు

కర్నూలు (న్యూటౌన్): జిల్లా ఎస్పీ జి కృష్ణకాంత్ ఆదేశాల మేరకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ల పరిధిలో ఇసుక అక్రమ రవాణాపై దాడులు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదివారం రెండు ట్రాక్టర్లను జప్తు చేసి రూ.20వేలు అపరాధ రుసుంను ప్రభుత్వ ఖజానాకు జమ చేశామన్నారు. ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి 8 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. సుంకం చెల్లించని అక్రమ మద్యంపై నాలుగు కేసులు నమోదు చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద నుచి 163 మద్యం బాటిళ్లనును స్వాధీనం చేసుకున్నామన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



ప్రతిభా పురస్కారాలు అందుకున్న బ్రాహ్మణ విద్యార్థులు

కర్నూలు(అర్బన్): విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షులు కరణం కిశోర్‌కుమార్ అన్నారు. 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి, విద్యార్థులకు ఆదివారం రాత్రి స్థానిక ఉత్తరాది మఠంలో ప్రతిభా పురస్కారాలను అందించారు. బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ వేణుగోపాల్, బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాక కార్యదర్శి బాలా శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషన్‌రావు, అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు టీవీ రవిచంద్రశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా కరణం కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమొంటోలు, శాలువాలు అందించి సత్కరించారు. కార్యక్రమంలో దేవి ఫంక్షన్ హాలు అధినేత చంద్రశేఖర్, బ్రాహ్మణ సంఘాల నాయకులు కంచు గంటల శ్యామ్‌సుందరరావు, ఆనందరావు, శ్రీనివాస రాజు, విష్ణు కీర్త పాల్గొన్నారు.

ఆలూరులో చోరీ



బీరువా తెరిచిన దృశ్యం

ఆలూరు రూరల్: ఆలూరులోని ఉపాధ్యాయన గర్‌లో చోరీ జరిగింది. ఈ చోరీ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. హర్దగేరి ప్రభుత్వ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న వీరేష్ వేసవి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఊరికి వెళ్లాడు. వీరేష్ సోదరుడు శనివారం సాయంత్రం ఇంటి ఆవరణంలో చెట్లకు నీళ్ల వదలడానికి రాగా..ఇంటి తాళాలు పగలుగొట్టి ఉండడం చూసి వీరేష్‌కు సమాచారం ఇవ్వడంతో ఆలూరుకు వచ్చి తన ఇంట్లో దొంగతనం జరిగినట్లు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో ఉన్న 30 గ్రాముల బంగారు, 300 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.55 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువు మట్టి.. చేనుకు పుష్టి

- పెరగనున్న భూసారం
- చీడపీడలు తక్కువ
- అధిక దిగుబడులకు అవకాశం
- జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు సూచనలు



పొలాలకు తరలించిన చెరువు మట్టి

కర్నూలు(అగ్రికల్చర్): పంటల సాగులో ప్రధాన భూమిక భూసారనిదే. భూసారం తగ్గితే పంటలు తెగుళ్లు, పురుగులను తట్టుకోలేవు. పురుగుల బెడద అధికమయ్యే ప్రమాదం ఉండటం వల్ల రైతులపై పెట్టుబడి వ్యయం ఎక్కువవుతుంది. భూసారాన్ని తక్కువ ఖర్చుతో పెంచుకునేందుకు చెరువుమట్టి చక్కటి అవకాశం. భూములకు చెరువు మట్టి తోలించుకునేందుకు ఇది మంచి తరుణం. చెరువు మట్టి ఉపయోగాలను జిల్లా ఉద్యాన అధికారి పి.రామాంజనేయులు వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

- చెరువు మట్టితో భూమితో తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది. నీటి వినియోగ సామర్థ్యంతో పాటు భూమిలోని సారం పెరగడానికి దోహద పడుతుంది. చెరువు మట్టిలో ముఖ్యంగా పండ్ల తోటలకు అవసరమైన అన్ని రకాల స్థూల, సూక్ష్మ పోషకాలు ఉంటాయి. సేంద్రియ కర్బనం , నత్రజని, భాస్వరం, పొటాష్, సూక్ష్మపోషకాలు పెరిగి అధిక దిగుబడి వస్తుంది. సేంద్రియ కర్బనం ఎక్కువగా ఉంటే మినరలైజేషన్ ఎక్కువగా జరిగి మొక్క పెరుగుదల జరుగుతుంది. చెరువు మట్టిని నల్లరేగడి భూముల కంటే ఎర్ర, చౌడు నేలల్లో వాడితే లాభం ఎక్కువగా ఉంటుంది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో చెరువు మట్టి అందుబాటులో లభిస్తోంది.
- జిల్లాలో పండ్లతోటల సాగు పెరుగుతోంది. పాత తోటలకు, కొత్తగా పండ్లతోటలు అభివృద్ధి చేసుకోవడానికి చెరువు మట్టి వినియోగం మంచి ఫలితాలను ఇస్తుంది. మామిడి, జామ, దానిమ్మ, బత్తాయి తదితర పంటలకు చెరువు మట్టి వాడకం వలన వేరు వ్యవస్థ బలంగా విస్తరించి ఏపుగా పెరుగుతుంది. దీంతో భూమిలో తేమను నిలుపుకొనే శక్తి పెరుగుతుంది. పాదులో మల్చింగ్ మాదిరిగా ఉపయోగపడుతుంది. ఎకరానికి 10 ట్రాక్టర్ల చెరువు మట్టిని వేసుకోవచ్చు.
- టమాట, బెండ, వంకాయ తదితర కూరగాయల సాగులో అధిక దిగుబడుల కోసం ఎరువులు ఎక్కువగా వాడుతున్నారు. దీనితో పెట్టుబడి ఎక్కువ అవుతుంది. కూరగాయలు సాగుచేసే పొలాల్లో ఎకరానికి 8- 10 ట్రాక్టర్ల చెరువు మట్టి ఆఖరి దుక్కిలో వేసి కలియదున్నితే మంచి నాణ్యత గల పంటలు వస్తాయి. పెట్టుబడి తుగ్గుతుంది. అంతేకాక తేమశాతం కూడా తగ్గకుండా ఉంటుంది.

ఒక కిలో చెరువు మట్టిలో ఉండే పోషకాలు

నత్రజని	720 మిల్లీ గ్రాములు
భాస్వరం	35 మిల్లీ గ్రాములు
పొటాష్	310 మిల్లీ గ్రాములు
కర్బనం	0.5 మిల్లీ గ్రాములు
జింక్	2.8 మిల్లీ గ్రాములు
బోరాన్	0.8 మిల్లీ గ్రాములు
గంధకం	18 మిల్లీ గ్రాములు
మేలు చేసే సూక్ష్మజీవుల	
సాంద్రత	308 మిల్లీ గ్రాములు